క్లుప్తంగా

'గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

మెళియాపుట్టి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం పరిశీలించారు. గ్రామంలోని కాలువలు శుభ్రం చేయించి, బావుల్లో క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శికి సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి నిల్వలు, చెత్తాచెదారాలు లేకుండా ప్రజలు అధికారులకు సహకరించాలని, పశువులను వీధుల మధ్యలో కట్టరాదని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో తయారు చేసిన ఎరువుని పరిశీలించి, గ్రామ పంచాయతీలో రైతులకు అందించాలన్నారు. వారితో పాటు ఈవోపీఆర్డీ తారకేశ్వరి, కార్యదర్శి అప్పారావు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

బీజామృతంతో విత్తన శుద్ధి



విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

హిరమండలం: ఖరీఫ్‌లో రైతులు బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఎంఎల్‌పురం గ్రామంలో సామూహిక బీజామృతంతో విత్తన శుద్ధి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వలన భూమి నుంచి వచ్చే తెగుళ్లు రానివ్వకుండా ఉంచుతుందన్నారు. తద్వారా పురుగు మందులు అవసరం ఉండదన్నారు. దీంతో రైతుకు పెట్టుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. విత్తశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాదంగా గోడ కూల్చివేత



గోడను గునపాలతో పొడుస్తున్న స్థానికులు

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామానికి చెందిన కోనారి అచ్చయ్యకు చెందిన గోడను స్థానికులు పలువురు కూల్చివేయడం వివాదంగా మారింది. అచ్చయ్య తనకున్న జిరాయితీ స్థలంలో గోడ నిర్మించుకున్నాడు. అయితే స్థానికులు కొంతమంది ఆ గోడను, వేసుకున్న రేకుల షెడ్‌ను శనివారం కూల్చివేశారు. దీనిపై బాధితుడు సారవకోట పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వగా, ఎస్‌ఐ అప్పారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై తాను కోర్టును ఆశ్రయిస్తున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. అలాగే సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే అచ్చయ్య నిర్మించిన గోడ మురుగు నీటి కాలువకు అడ్డంగా ఉందని, దీని వలన మురుగు నీటి కాలువ నుంచి వెళ్లకపోవడంతో కూల్చినట్లు స్థానికులు పేర్కొన్నారు.

వాతావరణ మార్పులపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాతపట్నం: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధ్యాపకుడు శివప్రసాద్ పట్నాయక్ అన్నారు. ఈ మేరకు సెంటెన్స్ అన్ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. పాఠశాల నుంచి అల్‌ఆంధ్ర రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. ప్రకృతిని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిసుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జి.సింహాచలం, మూర్తి, జ్యోతికా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని గూనభద్ర కాలనీకి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వైకుంఠరావు, మాజీ సర్పంచ్ లోతుగెడ్డ రవినాయుడు, శివనాయుడు, తిరుపతిరావు, సింహచలంల చేతులు మీదుగా నోట్‌బుక్స్‌ను శనివారం పంపిణీ చేశారు. వీటిని వైకుంఠరావు, రవినాయుడుల ఆర్థిక సాయంతో కొనుగోలు చేశారు. పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యేష్ఠ పౌర్ణమి పూజలు



పాతపట్నం: స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



హిరమండలం: స్వామివారికి స్నాన వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: జగన్నాథ స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని అవలింగి శ్రీజగన్నాథ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో జ్యేష్ఠ పౌర్ణమి పూజలు నిర్వహించారు. వచ్చే నెలలో ఈ ఆలయంలో జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించనున్నందున పూజలు చేపట్టినట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ఆరుబయట ఏర్పాటు చేసి పంచామృతాలలో అభిషేకాలు నిర్వహించారు.

హిరమండలం: జూలై 7వ తేదీ నుంచి జగన్నాథుడి రథయాత్ర వేడుకలు ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా స్థానిక బస్టాండ్ సమీపంలోని జగన్నాథుడి ఆలయంలో స్వామివారి స్నాన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో స్నాన వేదికపై స్వామివారిని ఉంచి సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాతపట్నం: పట్టణంలోని జుబ్లి రోడ్డులో ఉన్న జగన్నాథ స్వామి ఆలయంలో శ్రీజగన్నాథ స్వామి చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. పంచామృతాలు, సుగంధ పరిమళమైన గంగాజలంతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు



సరుబుజ్జిలి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు



జలుమూరు: యంత్రంతో విత్తనాలు వేస్తున్న దృశ్యం

జలుమూరు: వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ అన్నారు. మండల పరిధి లింగాలవలస, యలమంచిలి గ్రామాల్లో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యంత్రాలతో ఒకేసారి విత్తనాలు, ఎరువులు వేసే పద్ధతి(ఫెర్టీ కమ్ సీడ్ డ్రిల్)పై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో నీటి లభ్యత ఆధారంగా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా సాంకేతిక, యాజమాన్య పద్ధతులు పాటించాలని, ఎకరాకు కేవలం 16 కిలోల శుద్ధి చేసిన విత్తనాలు చదును చేసిన పొలంలో చల్లుకోవాలన్నారు. విత్తనం ఎక్కువ లోతులో వేస్తే మొలక శాతం దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. అందువలన నేలపై 2.5 నుంచి 5 సెంటీమీటర్ల లోతులో విత్తనం పడేటట్లు మొక్కకు మొక్కకు కనీసం పది సెంటీమీటర్లు దూరం ఉండాలన్నారు. దీనివలన గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల నివారణ, కలుపు తీయడం, ఎరువులు వేసుకోవడం సులువుగా ఉంటుందన్నారు. రైతులు విత్తనాలు వేసే ముందు పది గ్రాముల సూడోమోనస్ కేజీకి చొప్పున కలిపి చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్, రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణతో మేలు

సరుబుజ్జిలి: వ్యవసాయంలో యాంత్రీకరణతో మేలు జరుగుతుందని రెడ్డీస్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అత్తులూరి లావణ్య అన్నారు. మండలంలోని వెన్నెలవలస గ్రామంలో ఫెర్టీ కమ్ సీడ్ డ్రిల్ విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త బి.రాజ్‌కుమార్, రైతు మిత్రలు మజ్జి రామకృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల కదలికలపై నిఘా



అల్ ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు

పాతపట్నం: పట్టణంలో వాహన కదలికలు, అనుమానితులపై నిఘా వేసినట్లు సీఐ నల్లి సాయి తెలియజేశారు. ఇటీవల జాతీయ రహదారి పనుల్లో భాగంగా పనిచేయకపోయిన సీసీ కెమేరాలను మరలా పునరుద్ధరించినట్లు వెల్లడించారు. జాతీయ రహదారిలో అమ్మవారి ఆలయం సమీపంలోని పై ఓవర్ బ్రిడ్జి వద్ద పనులు చేపడుతున్నప్పటికీ అక్కడ ఉన్న కెమేరాలు పనిచేస్తున్నాయన్నారు. అల్ ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో మూడు కెమేరాలు, నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం జంక్షన్‌లో మూడు కెమేరాలు, పోలీసు స్టేషన్ వద్ద మూడు కెమేరాలు ఏర్పాటు చేశారు. అలాగే దువ్వారివీధికి ఎదురుగా ఒకటి, సెయింటెన్స్ స్కూల్ వద్ద ఒకటి, రాష్ట్ర సరిహద్దులో కెమేరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల మార్గంతో పాటు ఒడిశా, మెళియాపుట్టి, టెక్కలి, శ్రీకాకుళం మార్గంవైపు కూడా నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిక్షిప్తమైన సమాచారం నేరుగా సర్కిల్ కార్యాలయంకు, జిల్లా ఎస్పీ కార్యాలయం కమోండ్ కంట్రోల్ రూమ్‌లకు కనిపించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

'కొత్త నేర చట్టాల అమలును ఆపాలి'



బొడ్డేపల్లి మోహన్‌రావు

ఆమదాలవలస: దేశంలో జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్న కొత్త నేర చట్టాల అమలును ఆపాలని ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు కేంద్ర ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షా స్మృతి 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872, భారతీయ నేర విధాన స్మృతి 1973 రద్దు కానున్నాయని పేర్కొన్నారు. వాటి స్థానంలో భారతీయ నాగారిక్ సురక్ష సంహిత 2023, భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ సాక్ష్య అదినియం 2023 అనే మూడు కొత్త నేర చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపారు. ఈ కొత్త చట్టాల్లోని పలు నిబంధనల రాజ్యాంగ బద్ధతపై అనేక రకాల న్యాయ సంశయాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ చట్టాల్లో సవరణలు చాలా వరకు క్రూరమైన స్వభావం కలిగినవిగా ఉన్నాయని, ఇవి మన ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడానికి, భారత్‌ను ఫాసిస్టు రాజ్యంగా మార్చడానికి ప్రభుత్వానికి శక్తిని ఇస్తాయని భావిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర పరిశోధన సంస్థలు, పార్లమెంట్, న్యాయ నిపుణులు, మేధావులు అధ్యయనం చేసి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. అందువలన ప్రస్తుతానికి కొత్త నేర చట్టాల అమలు ఆపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ చిట్టిరాజు సూచించారు. లావేరు మండలంలోని పెద్దకొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను చేపడుతున్న కూలీలు రోజుకు రూ.300 వేతనం వచ్చేటట్లు పని చేయాలని కోరారు. ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అనంతరం ఉపాధి నిధులతో అనుసంధానం కలిగిన నాడు-నేడు స్కూల్ ప్రహరీ, సచివాలయం సీసీ డ్రైనేజీలు పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీవో సత్యవతి, సిబ్బంది ఉన్నారు.

జగన్నాథునికి ప్రత్యేక పూజలు



గుజరాతిపేటలో జగన్నాథస్వామికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు జగన్నాథ స్వామి దేవాలయాలలో స్వామివారికి జ్యేష్టమాస పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుజరాతిపేట జగన్నాథస్వామి దేవాలయంలో పెంట వంశానికి చెందిన అర్చకులు జగన్నాథునికి విశేష పూజలు చేశారు. స్వామివారు నిద్రలోకి వెళ్లి మళ్లీ ఆషాఢమాసంలో రథయాత్ర ఉత్సవాల సమయంలో మేల్కొంటారని తెలిపారు. బొందిలీపురం జగన్నాథస్వామి ఆలయంలోనూ పూరీ తరహాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

24న వార్షికోత్సవాలు

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న షిర్డిగిరిపై వెలసిన షిర్డీసాయి బాబా విగ్రహ 18వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు షిర్డీ సాయిబాబా సేవా సంఘం సభ్యుడు తారకేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిబాబాకు పంచామృత అభిషేకాలు, 1008 మంది భక్తులతో సామూహిక సత్య వ్రతాలు, ప్రత్యేక పూజలు, పడాల హరిదాసు దివ్య ప్రవచనాలు, భజనలు కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

స్టూడెంట్ కిట్లు అందజేత



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ విద్యాలయంలో విద్యార్థులకు టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, తెలుగు యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో స్టూడెంట్ కిట్లు శనివారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు హనుమంతు గోపి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

హిరమండలం: గుండెపోటుతో మృతి చెందిన గొండు రమేష్ (30) అనే వ్యక్తి కుటుంబానికి జనసేన నాయకురాలు భవానీ రూ.20 వేలు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. కారు డ్రైవర్‌గా ఉపాధి పొందిన రమేష్‌ది నిరుపేద కుటుంబం కావడంతో ఆదుకున్నారు. దీంతో ఆమెకు మైత్రి కాలనీ యువకులు కృతజ్ఞతలు తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు ప్రశ్నలు అడుగుతున్న ఎంఈవో మాధవరావు

జలుమూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మండల విద్యాశాఖ అధికారి బి.మాధవరావు సూచించారు. మండలంలోని మహ్మద్‌పురం ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సమయపాలనతోపాటు రికార్డుల నిర్వహణ ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో విద్యార్థులకు అందించాలని సూచించారు.

ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణ



పారాయణ చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరేరామ మందిరంలో దివ్య జీవన సంఘం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణ శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణ, లక్ష్మీ అష్టోత్తర పారాయణర, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్య రహిత సమాజానికి కృషి'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ గణేష్

మెళియాపుట్టి: విద్యార్థులు మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని టెక్కలి ఎస్ఈబీ ఎస్ఐ గణేష్ కోరారు. స్థానిక దుక్కరా జన్నరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, మత్తు పదార్థాలకు బానిసలుగా మారి బంగారు భవితను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా బలవంతంగా మత్తు పదార్థాలు సేవించడానికి ప్రేరేపిస్తే తల్లిదండ్రులతో పాటు పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈనెల 26వ తేదీన మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, పలువురు ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టండి'



నరసన్నపేట: యారబాడులో సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో గోపీబాల



కొత్తూరు: కాలువల్లో చెత్త తొలగిస్తున్న కార్మికులు

నరసన్నపేట: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అపరిశుభ్రత కనిపిస్తే పంచాయతీ కార్యదర్శులదే బాధ్యత అని డివిజనల్ పంచాయతీ అధికారి గోపీబాల అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కోమర్తి, వీఎన్‌పురం, యారబాడు, ఉర్లాం పంచాయతీల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రతీ ఒక్కరూ పాటించాలని, గ్రామాల్లో అపారిశుద్ధ్యం తొలగించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు పర్యవేక్షించి పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అశ్రద్ధ వహించినా, పారిశుద్ధ్య పనులు చేపట్టకపోయినా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోమర్తిలో డంపింగ్ యార్డును పరిశీలించి పంచాయతీ కార్యదర్శి పద్మావతికి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ శాంతి, ఎంపీడీవో రామకృష్ణ, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో సర్పంచ్ పడాల కృష్ణవేణి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగ జరుగుతున్నాయి. పంచాయతీ పరిధిలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. పనులను పంచాయతీ కార్యదర్శి జానికి స్వరూపిణి పర్యవేక్షించారు.

'బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి'



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎంఈవో శాంతారావు



హిరమండలం: పాత హిరమండలంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని ఎంఈవో శాంతారావు అన్నారు. ఓఎస్‌సీ సర్వేలో భాగంగా సంబంధిత శాఖలు, ఎన్యూమరేటర్స్, మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎస్‌సీ సర్వే ప్రాధాన్యత వివరించారు. అలాగే డ్రాపౌట్స్‌ను గుర్తించి వారిని సమీప పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మరో ఎంఈవో దాలినాయుడు మాట్లాడుతూ విద్య ప్రాధాన్యత, పాఠశాలల్లో అమలు చేస్తున్న పథకాలు, సౌకర్యాలు ప్రజలకు వివరించి పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని కోరారు. దీంట్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐఈఆర్‌పీలు, సీఆర్‌ఎంటీలు, ఎడ్యూకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొనాలని ఆదేశించారు. అనంతరం మండలంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఐసీడీఎస్ పీవో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు ఉంటారన్నారు.

హిరమండలం: బడి ఈడు కలిగిన పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. శనివారం పాత హిరమండలంలో చైతన్య కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల వసతులు మెరుగుపడ్డాయని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాలలను పనిలో పెడితే నేరమన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎన్ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీకాం కంప్యూటర్స్, బీఏ హిస్టరీ(మేజర్), బీఏ రాజనీతి శాస్త్రం(మేజర్) మొదలైన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విశాలమైన ఆటస్థలం, విద్యార్థులకు లైబ్రరీ సదుపాయం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కోనేరులో తెప్పోత్సవం

కొత్తూరు: పట్టణంలోని రామాలయంలో సీతారాముల కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఆలయం 7వ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా వేద పండితులు జగన్వేర శర్మ, గుడిమెట్ల సురేష్ పంతులు వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు ఆచరించారు. స్థానిక హరిదాసు కోనేరులో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించారు. పుష్కరిణి చుట్టూ విద్యుత్ ఆలంకరణలతో పాటు బాణాసంచాలు పేల్చుతూ తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో వేలాది మందికి అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు.

ఆదమరిస్తే అంతే..!



మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. పరిసర గ్రామాల నుంచి రాకపోకలు సాగించే విద్యార్థులు ఆటోల్లో ఓవర్ లోడ్‌తో వెళ్లాల్సి వస్తోంది. అసలే గతుకుల రోడ్డు కావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- బూర్జ